ప్రజాశక్తి

శుక్రవారం 14 జూన్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



నేటి అర్ధ రాత్రి నుంచే..

జాలర్ల బతుకు వేట!

- బోట్లను సిద్ధం చేస్తోన్న మత్స్యకారులు
- నిషేధ కాలంలో అందని మత్స్యకార భరోసా
- ప్రభుత్వానికి ఫైలు పంపడంలోనూ మత్స్యశాఖ నిర్లక్ష్యం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రతి ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకూ సుమారు 2 నెలలుగా చేపల వేట నిషేధం తర్వాత శుక్రవారం రాత్రి నుంచి ఫిషింగ్ హార్బర్‌కు చెందిన మత్స్యకారులంతా యథావిధిగా సముద్రంపైకి వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. ఇప్పటికే బోట్లకు మరమ్మతు పనులు పూర్తిచేసుకున్నారు. చేపల వేట నిషేధ కాలాన్ని తూ.చ తప్పకుండా ఏటా మత్స్యకార కుటుంబాలు అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే గత ప్రభుత్వం ఈ కాలంలో మత్స్యకార భరోసా కింద రూ.10వేలు అందజేసేది. గడిచిన 2 నెలలుగా ఎన్నికల కోడ్ కారణాన్ని చూపించి మత్స్యకార భరోసా ఫైలును జిల్లా మత్స్యశాఖ అధికారులు పైకి పంపనందున మత్స్యకారులు ఆర్థిక సాయానికి నోచుకోలేక పోయారు. ఈ రెండు నెలల కాలంలో తమ కుటుంబాలకు పని దొరక్క నానా అవస్థలు పడే పరిస్థితులు నెలకొన్నా సరే తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించారు. కొత్త ప్రభుత్వంలో ఈ సాయం రూ.10వేల నుంచి రూ.20వేలకు పెంచే హామీ కూడా ఉండడంతో మొత్తం ఒకేసారి అకౌంట్లకు జమ చేస్తారన్న చర్చ కూడా తాజాగా సాగుతోంది.



వేటకు బోట్లను సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు

వేటపైనే వేల కుటుంబాలు...

విశాఖ తూర్పు, దక్షిణ నియోజకవర్గాల పరిధిలోని 10వేల మందికిపైగానే మత్స్యకారులు వందల బోట్లపై అనునిత్యం సముద్రంపై వేటకు వెళ్తూ జీవనోపాధి పొందుతారు. ఈ కాలంలో ప్రతి కుటుంబానికీ రూ.10వేలు చొప్పున మత్స్యకార భరోసా అందుతుంది. ఎన్నికల కోడ్ కారణంగా భరోసా అందించకపోవడంతో ఆర్థికంగా తీవ్ర అవస్థలు పడ్డామంటూ మైలపల్లి అప్పియమ్మ, అప్పలరాజు ప్రజాశక్తి వద్ద మొరపెట్టుకున్నారు. వేట నిషేధ సమయంలో ప్రభుత్వం సాయం చేస్తేనే తినే పరిస్థితి ఉంటుందని లేదంటే పస్తులతోనే వేల కుటుంబాలు అవస్థలు పడతామని ఆవేదన వ్యక్తం చేశారు.

కొత్త ప్రభుత్వంపై జాలర్ల ఆశలు...

కూటమి నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం కొలువు తీరడంతో రూ.10వేల నుంచి రూ.20వేలుకు చంద్రబాబు పెంచుతామన్న మత్స్యకార భరోసా హామీ అమలవుతుందని, గడచిన వేట నిషేధ సమయం 2 నెలలూ కలిపి భరోసా ఇస్తారన్న ఆశలతో వేల కుటుంబాలు ఫిషింగ్ హార్బర్‌లో ఎదురు చూస్తున్నాయి. కొత్త ప్రభుత్వం తానిచ్చిన మాటను నిలబెట్టుకుంటుందా? లేదా? ఎలా స్పందిస్తుందో చూడాల్సిందే!

విద్యార్థుల బంగారు భవిష్యత్తే లక్ష్యం

సాంఘిక, బిసి సంక్షేమ అధికారులతో కలెక్టర్ మల్లికార్జున



ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విద్యార్థుల బంగారు భవిష్యత్తే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించుకొని పనిచేయాలని, వారి అభ్యున్నతి కోసం ప్రత్యేక సమయం కేటాయించి ఉత్తమ సేవలందించాలని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. విద్యా సంవత్సరం ప్రారంభం నేపథ్యంలో సాంఘిక, బిసి సంక్షేమ శాఖ వసతి గృహాలలో కల్పించాల్సిన వసతులు, చేయాల్సిన ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ గురువారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాంఘిక సంక్షేమ, బిసి సంక్షేమ శాఖల వసతి గృహాలలో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. విద్యార్థుల మానసిక, శారీరక ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులకు మంచి అలవాట్లు అలవడేలా చర్యలు తీసుకోవాలని, ఉదయమే వ్యాయామం, యోగా చేసేలా, దినపత్రికలు చదివేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలని, విలువలు నేర్పాలని చెప్పారు. మంచి పోషకాహారం అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. సోషల్ మీడియా ప్రభావం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. విద్యార్థుల్లో మానసిక ధైర్యం నింపాలని, స్వతహాగా వారి పనులు వారే చేసుకునేలా తర్ఫీదు ఇవ్వాలని చెప్పారు. క్రమశిక్షణ అలవడేలా చర్యలు తీసుకోవాలన్నారు.

శాశ్వత తాగునీటి సదుపాయం ఉండేలా వాటర్ ప్యూరిఫైర్ ప్లాంట్లు పెడతామని, భోజన శాలలు ఆధునికరిస్తామని, మరుగుదొడ్లలో గీజర్లు అమర్చుతామని, క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ క్రీడా పరికరాలు అందిస్తామని చెప్పారు. ప్రభుత్వం తరపున కావాల్సిన తోడ్పాటు అందిస్తామని, అధికారులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేక కృషి చేసి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని, వంద శాతం అడ్మిషన్లు పూర్తి చేయాలని హితవు పలికారు.

సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రామారావు మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటి వరకు సాంఘిక, బిసి సంక్షేమ శాఖ వసతి గృహాలలో విద్యార్థుల సౌకర్యార్థం రూ.10.82 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి ప్రత్యేక వసతులు కల్పించామని చెప్పారు. సమావేశంలో బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీదేవి, డిఇఒ చంద్రకళ, హాస్టల్ వార్డెన్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ విమల విద్యాలయం మూసివేత

వార్త మెయిన్‌లో..

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా పవన్ కల్యాణ్ చూడాలి

వార్త 2లో..

స్కూల్ బస్సులపై రవాణా శాఖ కొరడా

వార్త 3లో..

జులై 29 నుంచి ప్రత్యేక లోక్ అదాలత్


వార్త 2లో..



పాఠశాలకు చేరుకుంటున్న విద్యార్థిని, విద్యార్థులు

తెరుచుకున్న పాఠశాలలు

ప్రజాశక్తి-విశాఖపట్నం: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం తెరుచుకున్నాయి. ఏప్రిల్ 24వ తేదీ నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించారు. ఈ నెల 12వ తేదీన పాఠశాలలు ప్రారంభంకావాల్సి ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకారం నేపథ్యంలో గురువారం పున:ప్రారంభించారు. దీంతో ఆటోలు, స్కూల్ బస్సులు, ద్విచక్రవాహనాలపై తల్లిదండ్రులతో కలిసి విద్యార్థులు పాఠశాలలకు వెళ్తూ రోడ్లపై హడావిడిగా కనిపించారు.



వైజాగ్‌లో ఆర్‌బిఐ ప్రాంతీయ కార్యాలయం

ప్రజాశక్తి-విశాఖపట్నం బ్యూరో : విశాఖపట్నంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుచేయనున్నారు. నగరంలోని విఎంఆర్‌డిఎ భవనంలో ఈ కార్యాలయం ఏర్పాటుచేయాలని ఆర్‌బిఐ అధికారులు భావిస్తున్నారు. ఆ భవనంలోని ఐదో అంతస్తును కేటాయించాల్సిందిగా జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జునను ఆర్‌బిఐ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ కోరారు. ప్రతి రాష్ట్రంలో ఆర్‌బిఐ ప్రాంతీయ కార్యాలయం ఉంటుంది. దీంతో రాష్ట్రంలోనూ ఈ కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా పవన్ కల్యాణ్ చూడాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా ప్రధాని మోడీతో మాట్లాడి, ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర మంత్రి పవన్ కల్యాణ్ చూడాలని విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా ఉపాధ్యక్షుడు బాబ్జీరావు కోరారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక ప్రజాసంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు గురువారం నాటికి 1170వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఆటో యూనియన్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పవన్ కల్యాణ్ స్టీల్‌ప్లాంట్ ప్రాంతానికి వచ్చి కార్మిక సంఘాలు ఏర్పాటుచేసిన బహిరంగ సభలో పాల్గొని స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా చూస్తానని హామీ ఇచ్చారని, ఆ హామీని నెరవేర్చాలని కోరారు. విశాఖ జిల్లా మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు, వర్మ, కెవి.రమణ, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


దీక్షలో కూర్చున్న ఆటో కార్మికులు

2 నుంచి చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని జులై 2 నుంచి 4వ తేదీ వరకు సీతారామరాజు విజ్ఞాన కేంద్రం, గురజాడ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యాన అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు ఉత్సవాల నిర్వహణ బాధ్యులు దండు నాగేశ్వరరావు తెలిపారు. గురువారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జులై 2న పాఠశాలలు, కాలేజీ విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు, 3న విద్యార్థులకు, ఔత్సాహిక కళాకారులకు నృత్యాలు, పాటలు, పద్యాలు, స్కిట్స్ జానపదాలు తదితర కళారూపాల ప్రదర్శనలకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని అందరూ ఉపయోగించుకోవాలని కోరారు. గురజాడ సాంస్కృతిక వేదిక బాధ్యులు ఆర్ఎస్ఆర్.మూర్తి మాట్లాడుతూ, నగర పరిధిలోని ప్రతి స్కూలు, కాలేజీ, కళా సంస్థలు ప్రదర్శనలలో పాల్గొనడానికి ఈ నెల 25వ తేదీలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. కళారూపాలు, అల్లూరి జీవితం, స్వాతంత్ర పోరాటంలో దేశ నాయకులు అంశాలు కలిగి ఉండాలన్నారు. పాల్గొన్న ప్రతి టీమ్‌కు, విజేతలకు జులై 4న సభ అనంతరం జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేస్తామని తెలిపారు. ప్రముఖ శాస్త్రీయ నృత్య కళాకారిణి డాక్టర్ విజయవాణి మాట్లాడుతూ, ఉచితంగా ప్రదర్శనావకాశాలు కల్పిస్తున్న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో, నగరంలో ఉన్న డాన్స్ అకాడమీలు, డాన్స్ స్కూల్స్ వినియోగించుకోవాలని, మంచి మంచి ప్రదర్శనలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం షార్ట్ ఫిల్మ్ విభాగం బాధ్యులు ఎం.ఎల్లాజీ మాట్లాడుతూ విద్యార్థులు, యువత తమ తమ కళా ప్రదర్శనలను ప్రదర్శించుకోవడానికి విజ్ఞాన కేంద్రాన్ని వేదికగా చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జివి.రవిరాజు, అంజిబాబు పాల్గొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు.



స్మారక వేడుకల్లో మాట్లాడుతున్న అతిథులు

'సమాజ సేవకుడు అథనాసిఏస్ యోహాన్'

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : బిలీవర్స్ ఈస్టర్న్ చర్చ్ అధినేత హిస్ హోలీనెస్ మోరన్ మోర్ అథనాసియస్ యోహాన్ ప్రథమ మెట్రోపాలిటన్ స్మారక వేడుకలు గురువారం పూర్ణా మార్కెట్ సమీపంలో ఉన్న టౌన్ హాల్‌లో బిలీవర్స్ ఈస్టర్న్ చర్చ్ డయాసిస్ ఆఫ్ వైజాగ్ ఫాథర్ తిమోతి ఆధ్వర్యాన జరిగాయి. ముఖ్య అతిథులుగా న్యాయవాది ఐఎం అహ్మద్, విశ్వబ్రాహ్మణ కమిటీ హాల్ అధ్యక్షులు గోడి నరసింహాచారి హాజరై మాట్లాడారు. మానవ సేవే మాధవ సేవ అని నమ్మిన వారిలో అథనాసియస్ యోహాన్ ప్రథమ మెట్రోపాలిటన్ మొదటి స్థానంలో ఉంటారన్నారు. వృద్ధులను, వికలాంగులను, అనాథలను, వితంతువులను, కుష్టు రోగులను అక్కున చేర్చుకొని వారి అభ్యున్నతికి ఎంతో పాటుపడ్డారని కొనియాడారు. వితంతువులకు ఆశ్రయాలు కల్పించారని, వీధి బాలలను ప్రయోజకులుగా తీర్చిదిద్దుటకు 'హోప్ ఫర్ చిల్డ్రన్' ప్రాజెక్ట్‌ని నెలకొల్పి ఆసియా, ఆఫ్రికాలోని 30 వేల మంది పేద పిల్లలు, వారి కుటుంబాలను తీర్చిదిద్దారని కొనియాడారు. కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ద్వారా దారిద్య రేఖకు దిగున ఉన్న కుటుంబాలకు ఉచితముగా టైలరింగ్ నేర్పించి వారికి కుట్టు మిషన్లు అందించారని తెలిపారు. ప్రకృతి విపత్తుల ద్వారా నష్టపోయిన వారికి గృహాలు నిర్మించడం, జాలరులకు బోట్లు, తదితర సామాజిక సేవ చేశారని చెప్పారు. ఈ స్మారక వేడుకలో ప్రముఖ క్రైస్తవ బిషప్స్, ఫాదర్స్, చర్చ్ నాయకులు, రాజకీయ, సామాజిక నాయకులు పాల్గొని ఘన నివాళులర్పించారు.

బాదం, వెల్లుల్లితో గుండె ఆరోగ్యం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : గుండె ఆరోగ్యానికి రోజువారి ఆహారంలో తప్పనిసరిగా బాదం, వెల్లుల్లి చేర్చాల్సి ఉందని న్యూట్రిషన్ అండ్ వెల్‌నెస్ కన్సల్టెంట్ షీలా కష్ణస్వామి తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆయన మాట్లాడుతూ, బాదంపప్పులో కాల్షియం, విటమిన్ ఇ, మెగ్నీషియం, ఫైబర్ అధికంగా ఉంటాయని, ఇవి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడతాయని చెప్పారు. వెల్లుల్లిలో అల్లిసిన్ అనే సమ్మేళనం ఉంటుందని, ఇది రక్తపోటు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుందని తెలిపారు. ఓట్స్‌లో కరిగే ఫైబర్ ఉంటుందని, ఎల్‌డిఎల్ కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుందని వివరించారు.

అసైన్డ్ భూముల కబ్జాపై విచారణ

విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అప్పలనాయుడు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర జిల్లాలలో అసైన్డ్ భూములను అక్రమంగా దోచుకున్న వ్యవహారంపై త్వరలోనే విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని, పేదలకు న్యాయం జరిగేలా చూస్తామని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చెప్పారు. విశాఖ టిడిపి కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమికి ఉత్తరాంధ్ర ప్రజలు భారీ మెజారిటీ ఇచ్చారన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల తీర్పుతో బాధ్యత మరింత పెరిగిందన్నారు. చంద్రబాబు విశాఖను ఆర్థిక రాజధానిగా ప్రకటించడం ఆనందం కలుగజేసిందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పాటుకాకముందే కొంత మంది విమర్శలు ప్రారంభించారన్నారు. రుషికొండ భవనాలను ప్రజల అవసరాలు కోసం ఉపయోగిస్తామన్నారు. ఉత్తరాంధ్రలో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులపై దృష్టి పెట్టామని తెలిపారు. సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమలశెట్టి శ్రీనివాసరావు, జిల్లా మీడియా కో-ఆర్డినేటర్ కె. గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

జులై 29 నుంచి ప్రత్యేక లోక్ అదాలత్

ప్రజాశక్తి-విశాఖపట్టణం : సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం జులై 29 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు ప్రత్యేక లోక్ అదాలత్‌లు నిర్వహించనున్నట్లు విశాఖపట్టణం జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ తెలిపారు. అత్యున్నత కోర్టు ఆదేశాల మేరకు ఆయా రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు తదుపరి చర్యలు చేపడుతున్నాయని చెప్పారు. విశాఖపట్టణం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఫిజికల్/వర్చువల్ విధానంలో ముందస్తుగా సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం ప్రీ లోక్ అదాలత్‌లు నిర్వహించి రాజీ చేసుకునేందుకు కక్షిదారులకు వీలు కల్పిస్తున్నట్లు వివరించారు. నోటీసులు అందుకున్న కక్షిదారులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి కేసులు రాజీ చేసుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లేదా టోల్ ఫ్రీ నెంబర్ 15100ను సంప్రదించాలని సూచించారు.

కాలుష్య నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలి : వంశీకృష్ణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలో కాలుష్య సమస్య పరిష్కారానికి అధికారులు తగు చర్యలు చేపట్టాలని, ప్రణాళికా బద్ధంగా శాశ్వత పరిష్కారం జరిగేలా చూడాలని దక్షిణ జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆదేశించారు. డాబాగార్డెన్స్ పరిధి కృష్ణా గార్డెన్స్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన అధికారులతో మాట్లాడారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ వచ్చినట్లు తెలియడంతో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వచ్చి ఆయనను కలిసి అభినందించారు. పలువురు స్థానిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలపై సంబంధిత అధికారులతో వెంటనే ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడి వాటిని పరిష్కరించాలని సూచించారు. కాలుష్య సమస్యపై ఎస్ఇ శ్రీనివాస్‌రాజుతో ఎమ్మెల్యే ప్రత్యేకంగా మాట్లాడారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

17 నుంచి విశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జగదాంబ జంక్షన్ సమీపంలోని శ్రీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 17 నుంచి 23వ తేదీ వరకు శ్రీ విశ్వేశ్వరస్వామి, బాలా త్రిపుర సుందరి అమ్మవారి కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ అడపా దేవుళ్లు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.


ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ క్లస్టర్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ నూతన క్లస్టర్ కార్యాలయాన్ని గురువారం ఎల్ఐసి "జీవన్ సమృద్ధి" ప్రాంగణంలో సంస్థ రీజనల్ మేనేజర్ తపన్ కుమార్ పట్నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖపట్నం, విజయనగరం, గాజువాక, రాజమండ్రి, కాకినాడ, తుని, భీమిలి ఏరియా ఆఫీసులకు సంబంధించిన గృహ రుణాలు మంజూరు ఈ కార్యాలయం కేంద్రంగా జరిగుతాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సౌత్ ఈస్టర్న్ రీజనల్ ఆఫీస్ హైదరాబాద్‌లో ముఖ్య కార్యాలయం కలిగి గృహరుణ మంజూరులో దేశంలో ప్రతమ స్థానంలో నిలిచిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.13 వేల కోట్ల పైబడి రుణ వితరణ లక్ష్యంతో పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ రీజనల్ హెడ్ (మార్కెటింగ్) వైవివిఎస్ రామకృష్ణారావు, క్లస్టర్ హెడ్ విజయశ్రీ, ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదా ప్రసాద్ దాస్, మేనేజర్ (ఆపరేషన్స్) వైకెకె.శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



ఎల్ఐసి హైసింగ్ ఫైనాన్స్ క్లస్టర్ కార్యాలయం ప్రారంభంలో సంస్థ రీజనల్ మేనేజర్ తదితరులు

ఐహెచ్‌ఆర్‌సి ఆర్థికసాయం



బాధితురాలికి చెక్కు అందజేస్తున్న సంస్థ సభ్యులు

పెందుర్తి/ వేపగుంట : :కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఆరిలోవ అపోలో ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఆర్థికంగా చితికిపోయిన బి.రమాదేవికి వేపగుంటలోని ఐహెచ్‌ఆర్‌సి సంస్థ రూ. 40వేల ఆర్థికసాయం అందించింది..అనందపురం మండలం పెద్దిపాలెం గ్రామానికి చెందిన రమాదేవి అనారోగ్య, ఆర్థిక పరిస్థితి ఐహెచ్‌ఆర్‌సి దృష్టికి రావడంతో సంస్థ సభ్యులు స్పందించి, రూ.40వేలు ఆర్థికసాయాన్ని చెక్కుగా అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ నేషనల్ చైర్మన్ రాజాన ప్రసాదరావు మాట్లాడుతూ, తమ సంస్థ తరపున ఉత్తరాంధ్రలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల్లో మానవహక్కులపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. నేషనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎ.హ్యాపీ, మీడియా సెక్రెటరీ బి.దేవుడుబాబు, సౌత్ ఇండియా ఇన్‌ఛార్జి రవివర్మ, ఎపి, తెలంగాణ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అడ్వైజర్ పి.మురళి, స్టేట్ సెక్రెటరీ రెడ్డి వెంకట రావు విశాఖ జిల్లా అడ్వైజర్ సీతారామరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ బి రమేష్‌కుమార్, డి వెంకటసత్యం పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ



బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న సుధాకర్

ప్రజాశక్తి - ఆరిలోవ :జివిఎంసి 10వ వార్డు బిఎన్‌ఆర్.నగర్‌లో ఆర్థికంగా, అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కుటుంబానికి అదే వార్డుకు చెందిన టిడిపి నాయకులు బలగం సుధాకర్ నాయుడు నిత్యావసర సరుకు అందజేసి తన ఉదారత చాటుకున్నారు. బిఎన్‌ఆర్ నగర్‌కు చెందిన నరవ రాములు కరోనాతో మృతి చెందారు. ఆయన కుమారుడు, కుమార్తెలు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారు. స్థానిక మహిళ కొండమ్మ ద్వారా విషయం తెలుసుకున్న బలగం సుధాకర్, బాధిత కుటుంబానికి బియ్యం బస్తా, నూనె, పప్పులు, పండ్లు, ఇతర నిత్యావసరాలను అందజేసారు. స్థానిక మహిళలు బుజ్జమ్మ, శ్రీదేవి, వరలక్ష్మీ, మణెమ్మ, కనకమహాలక్ష్మీ పాల్గొన్నారు.

స్కూల్ బస్సులపై రవాణాశాఖ కొరడా

▸▸ నిబంధనలు పాటించని బస్ సీజ్ : మరో ఏడింటిపై కేసు నమోదు



తనిఖీల్లో పాల్గొన్న ఆర్‌టిఒ శిరీషాదేవి, ఇతర అధికారులు

ప్రజాశక్తి- ఆనందపురం : నిబంధనలు పాటించని స్కూల్, కాలేజీ బస్సులపై రవాణాశాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. గురువారం రవాణా శాఖ అద్వర్యంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. గురువారం గంభీరం ఆర్‌టిఒ కార్యాలయం సమీపంలో ఆర్‌టిఒ శిరీషాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో వివిధ రకాల నిబంధనలను ఉల్లంఘించిన ఏడు స్కూల్ బస్సులపై కేసులు నమోదు చేశారు. ఒక బస్‌ను సీజ్‌చేసినట్లు ఆర్‌టిఒ శిరీషాదేవి తెలిపారు.

కాగా పాఠశాలలు, కాలేజీలు పున:ప్రారంభమైన నేపథ్యంలో బస్సుల కండిషన్‌పై రవాణాశాఖ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు విశాఖపట్నం ఉప రవాణా కమిషనర్ రాజరత్నం ప్రకటనలో తెలిపారు. మోటారు వాహన తనిఖీ అధికార్లు కె ప్రవీణ్‌కుమార్, ఎఎస్.గణేష్‌రెడ్డి, హరి ప్రసాద్, మాధవి, సుమన్ కుమార్, శిరీషాదేవి, లలితా, శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా స్కూల్ బస్‌లపై తనిఖీలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

గ్రీన్‌బెల్ట్ సుందరీకరణ పనుల పరిశీలన



గ్రీన్‌బెల్ట్ పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 52వ వార్డు గ్రీన్‌బెల్ట్‌లో సుందరీకరణ, అభివృద్ధి పనులను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పరిశీలించారు. గురువారం సంబంధిత జివిఎంసి అధికారులతో కలిసి, ఆర్ అండ్ బి జంక్షన్ దగ్గర గ్రీన్‌బెల్ట్, మ్యారియెట్ ఎదురుగా మహిళల కు ప్రత్యేకంగా రూపుదిద్దుకుంటున్న గ్రీన్ బెల్ట్ పనులను అలాగే పాస్‌పోర్ట్ ఆఫీస్, అపర్ణా అపార్ట్‌మెంట్, జిందాల్ భవన్, అంబేద్కర్ నగర్ తదతర ప్రాంతాలలో ముగింపు దశకు చేరుకున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. 52వ వార్డును అత్యంత సుందరంగా తీర్చిదిద్దాలని, పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జివిఎంసి ఎస్ఇ వేణుగోపాల్, హార్టీకల్చర్ డిడి. దామోదర్, డిఇఇ ఏడుకొండలు, ఎఇఇ ఉష, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

10వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, కార్పొరేటర్

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు పరిధి రవీంద్రనగర్‌లో పలు అభివృద్ధి పనులకు గురువారం తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ రాజశేఖర్‌తో కలిసి శంకుస్థాపన చేసారు. జివిఎంసి నిధులు రూ.33 లక్షల వ్యయంతో డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానికులుపలు సమస్యలను ఎమ్మెల్యే వెలగపూడి దృష్టికి తెచ్చారు. వీధి దీపాలు నిర్వహణ, రహదారులు, మంచినీటి సరఫరా వంటి సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించి, వాటిని పరిష్కరించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే వెలగపూడి స్పందిస్తూ సంబంధిత అధికారులకు చెప్పి వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జోనల్ కమిషనర్ శైలజా వల్లీ, ఎఇఇ వెంటకరావు, టిడిపి నాయకులు గాడు అప్పలనాయుడు, కేతా సత్యనారాయణ, ఒమ్మి అప్పల రాజు, రాగతి అచ్యుతరావు, బలగం సుధాకర్ నాయుడు, మూది అప్పారావు, పేపర్ నాయుడు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం.పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో భవనం పైనుంచి పడి వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన గురువారం చోటుచేసుకుందని సిఐ వై.రామకృష్ణ తెలిపారు. వివరాలివి.

మారికవలస రాజీవ్ గృహ కల్ప కాలనీ బ్లాక్ నెంబర్ 100లో ధర్మారావు(60), సత్యవతితో కలిసి నివాసం ఉంటున్నారు. వీరి కుమారుడు ఆర్‌జికె కాలనీలో బ్లాక్ నెంబర్ 66లో నివాసం ఉంటున్నారు. అయితే తన భర్త ధర్మారావు కొన్నాళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడని, అదే క్రమంలో మానసిక కుంగుబాటుకు గురయ్యాడని మృతుడి భార్య తెలిపిందన్నారుఉ. అదే క్రమంలో మానసిక ఆసుపత్రికి వెళ్లడానికి సిద్ధమవుతుండగా, ఇంతలో తన భర్త బ్లాక్ టెర్రస్‌పైకి వెళ్లి ఎత్తు నుండి దూకి ఆత్మహత్య చేసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొందన్నారు. అందని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు



నౌసిన్ ఫాతిమా

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం.పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని విద్యార్థి అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందిందని సిఐ వై.రామకృష్ణ తెలిపారు. సిఐ తెలిపిన వివరాల మేరకు, నగరానికి చెందిన నౌసిన్ ఫాతిమా పిఎం.పాలెంలోని సాంకేతిక ఇంజనీరింగ్ కళాశాలలో బీఫార్మసీ మూడవ సంవత్సరం చదువుతోంది. ఎప్పటిలాగే బుధవారం ఇంటి నుండి కళాశాలకు వచ్చింది. కళాశాల అనంతరం ఇంటికి తిరిగి రాలేదు. దాంతో కుటుంబసభ్యులు చుట్టుపక్క ప్రాంతంలోనూ, బంధువులు ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకక పోవడంతో పోలీసులను ఆశ్రయించారు. విద్యార్థిని తండ్రి అబ్బాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ రామకృష్ణ తెలిపారు.

టిఎన్‌టియుసి కార్మికుల సంబరాలు



హిందుస్తాన్ షిప్‌యార్డ్ గేటు వద్ద సంబరాల్లో టిఎన్‌టియుసి నేతలు

ప్రజాశక్తి- ములగాడ : ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఘనవిజయం సాధించి, ముఖ్యమంత్రిగా తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాలుగోసారి ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా హిందుస్తాన్ షిప్‌యార్డ్ మెయిన్ గేటు వద్ద టిఎన్‌టియుసి అధ్యక్ష, కార్యదర్శులు ఉరూకూటి మురళీ, సిహెచ్.రాము ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. భారీ కేక్ కట్ చేసి, సుమారు మూడు వేలమంది కార్మికులకు మిఠాయిలు పంచారు. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుతూ విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు నక్కా లక్ష్మణరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వి రమణమూర్తి, వివిధ ట్రేడ్ యూనియన్ నాయకులు, కార్యవర్గ సభ్యులు, సానుభూతిపరులు పాల్గొన్నారు.

ఎయిర్ కూలర్ వితరణ

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, ఆర్ తాళ్ళ వలసలోని అనాధ పిల్లల సంరక్షణ కేంద్రానికి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సతీమణి శారద రూ.60 వేలు విలువైన ఎయిర్ కూలర్‌ను గురు వారం బహూకరించినట్లు కేంద్రం నిర్వాహకులు వి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తాము అడిగిన వెంటనే స్పందించి సహాయం చేసిన ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

ముమ్మరంగా ఫాగింగ్

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి ఎనిమిదో జోన్ మేఘాద్రిగెడ్డ, పద్మనాభనగర్, పంచగ్రామాల్లో జోనల్ కమిషనర్ హేమావతి ఆదేశాలతో ముమ్మరంగా ఫాగింగ్ నిర్వహించారు. 92వ వార్డు మలేరియా నిర్మూలనాధికారి దాలినాయుడు పర్యవేక్షణలో దోమలు, వాటి లార్వాలు వృద్ధి చెందకుండా నివారణ చర్యల్లో భాగంగా ఫాగింగ్ చేపట్టారు.

రహదారిపైనే వ్యాపారాలు!

▸▸ రాకపోకలకు వాహనదారులు, ప్రజల అవస్థలు

▸▸ పట్టించుకోని అధికారులు, పోలీసులు



ట్రాఫిక్ వలయంలో ఉన్న ఆనందపురం పూలమార్కెట్ కూడలి

ప్రజాశక్తి-ఆనందపురం: ఆనందపురం మార్కెట్ రహదారిలో నిత్యం తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. మండలంలో వేములవలస మహాత్మాగాంధీ పూలు మార్కెట్ జాతీయ రహదారికి ఆనుకునే ఉంది. నిత్యం మార్కెట్లో లక్షల్లో క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. ఇక్కడ మార్కెట్ రహదారిలో ట్రాఫిక్ తీవ్రమైన సమస్యగా మారింది. వ్యాపారస్తులు రోడ్డుపైనే వ్యాపారాలు సాగించడం వల్ల తీవ్రమైన రద్దీ ఏర్పడుతోంది. ఉదయం వేళలో ఈ మార్కెట్‌ను దాటి ప్రయాణాలు చేయాలంటే ప్రజలు, వాహనదారులు భయపడుతున్నారు. పాఠశాలలకు కళాశాలలకు వెళ్లే విద్యార్థులు గంటల తరబడి మార్కెట్ వద్ద ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి,సరైన సమయానికి గమ్యస్థానానికి వెళ్లలేకపోతున్నారు. ట్రాఫిక్ పోలీసులు కొంతమేర ట్రాఫిక్‌ను నియంత్రించినప్పటికీ, పూర్తిస్థాయిలో అదుపుచేయడం సాధ్యం కావడం లేదు. రోడ్డుపైనే వ్యాపారాలు సాగించడం వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. మార్కెట్లో సుమారు 300 మీటర్ల రహదారిని క్రయవిక్రయాలతో వ్యాపారస్తులు మూసేస్తున్నారని పలువురు వాపోతున్నారు. ఫ్లైఓవర్ కిందన అక్కడున్న రహదారి ఇరుకుగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. ఆనందపురం జంక్షన్ మీదుగా రాకపోకలకు ఇదొక్కటే మార్గం కావడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆనందపురం మార్కెట్ వద్ద నెలకొన్న ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, అధికారులు, పోలీసులు, మార్కెట్ కమిటీ యాజమాన్యం, పంచాయతీ అధికారులు చొరవ తీసుకొని తగు చర్యలు తీసుకోవాలని కోరుతుఉన్నారు. రోడ్డుపై వ్యాపారాలు నియంత్రించి, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూడాలని వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు

అన్నా క్యాంటీన్లకు పూర్వ వైభవం

పున:ప్రారంభానికి జోరుగా సన్నాహాలు

ప్రజాశక్తి- పెందుర్తి : తెలుగుదేశం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన అన్నా క్యాంటీన్లకు మళ్లీ పూర్వవైభవం రానుంది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు మొదటగా సంతకాలు చేసిన ఐదు ఫైళ్లలో మూడో సంతకంగా అన్నాక్యాంటీన్లను పునరుద్ధరించాలని నిర్ణయించారు. దీంతో పలువురు వాహనదారులు, కార్మికులు, పేద ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టిడిపి హయాంలో ఐదేళ్ల క్రితం జివిఎంసి 94వ వార్డు వేపగుంటలోనూ అన్నా క్యాంటీన్‌ను అట్టహాసంగా ప్రారంభించారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో రూ.ఐదుకే అల్పాహారం, భోజనం అందించడంతో ఎంతో మందికి ప్రయోజనం చేకూరింది. అయితే వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నాక్యాంటీన్లను ఎత్తేశారు. దీంతో ఐదేళ్ళుగా వాడకం లేకపోవడంతో అన్యాక్యాంటీన్ భవనాలు అధ్వానస్థితికి చేరుకున్నాయి. ఈ భవనాలను వేరే అవసరాలకైనా వినియోగించే పరిస్థితి లేకపోవడంతో కొన్నిచోట్ల పిచ్చిమొక్కలు మొలిచి, చెత్తపేరుకుపోయి శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇపుడు టిడిపి వీటిని పునరుద్ధరించాలని నిర్ణయించడంతో ఇప్పటికే పలుచోట్ల అన్యాక్యాంటీన్ భవనాలను శుభ్రం చేసే పనిలో అధికారయంత్రాంగం నిమగ్నమై ఉంది.



తగరపువలస అన్నా క్యాంటీన్ వద్ద టిడిపి నేతల సంబరాలు

తగరపువలస :స్థానిక పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న అన్నా క్యాంటీన్ పున్ణప్రారంభానికి జోరుగా సన్నాహాలు చేస్తున్నారు. అదే స్థలంలో అన్నాక్యాంటీన్ నిర్వహణకు జివిఎంసి ఒకటో జోన్ అధికారులు కొద్ది రోజులుగా చురుగ్గా ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులను టిడిపి ఒకటో వార్డు అధ్యక్షులు తమ్మిన సూరిబాబు, పార్టీ నాయకులు కొప్పల రమేష్, చిలకా నరసింగరావు, నరవ రామారావు, డి వెంకటేష్ , పైడి రాజు, గరే సదానంద తదితరులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు

కేంద్ర కారాగారంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న జైల్ అధికారులు

ప్రజాశక్తి - ఆరిలోవ : అంతర్జాతీయ రక్త దాన దినోత్సవం సందర్భంగా విశాఖపట్నం బ్లడ్ డోనర్స్ క్లబ్ , హెల్పింగ్ హర్ట్స్ ఆధ్వర్యంలో విశాఖపట్నం సెంట్రల్ జైల్‌లోని జైల్ అధికారులు, సిబ్బందితో కలిసి గురువారం రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారిలో సెంట్రల్‌జైల్ సూపరింటెండెంట్ ఎస్ కిషోర్‌కుమార్, అడిషనల్ ఎస్‌పి ఎం వెంకటేశ్వర్లు, డిఎస్‌పి ఎస్ రామచంద్రరావు, కమలాకర్, ఇతర అధికారులతోపాటు సిబ్బంది ఉన్నారు. కార్యక్రమంలో విశాఖ బ్లడ్ డోనర్స్ క్లబ్, హెల్పింగ్ హర్ట్స్ వ్యవస్థాపక అధ్యక్షులు సాసుపల్లి రాజకుమారి, ఇతర సభ్యులు కందాళ ఛాయ, ప్రవీణ్, విశాల్ పాల్గొన్నారు.

పంచాయతీ నిధులతో బోర్లు ఏర్పాటు



బోరు ప్రారంభిస్తున్న ఎంపిపి రాంబాబు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామపంచాయతీ పరిధిలోని కన్నయ్య గారి కళ్లాలు, బొడ్డువారి కళ్లాలు వద్ద పంచాయతీ నిధులతో రెండు మంచినీటి బోర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కొక్కటీ రూ.80వేలు చొప్పున రూ.1.60లక్షలతో ఏర్పాటు చేసి రెండు బోర్లు ఏర్పాటు పనులను ఎంపిపి కె.రాంబాబు గురువారం ప్రారంభించారు. ఆయా ప్రాంతాల్లో పాడి, ఇతర పశువుల పెంపకం ఎక్కువగా ఉన్నందున వాటి తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని వీటనిఇ ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిపి రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో సత్యనారాయణ, ఎర్రినాయుడు, రాము నాయుడు, పాల సంఘం మాజీ అధ్యక్షుడు అప్పలరాజు, ప్రాథమిక సహకార సంఘం డైరెక్టర్ కె.ప్రకాష్ పాలకేంద్రం ప్రెసిడెంట్ ప్రకాష్, రంగయ్య, నారాయణరావు పాల్గొన్నారు.


భూయాజమాన్య హక్కు చట్టం రద్దుపై హర్షం

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : ప్రజాకంటకమైన భూయాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వానికి ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు. భూయాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోర్టు విధులను బహిష్కరించి గతంలో 70 రోజులకుపైగా రాష్ట్రవ్యాప్తంగా ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్, ఇండియన్ లాయర్స్ ఆఫ్ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు మిగతా న్యాయవాదులు నిరసన వ్యక్తం చేసినా గత ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేదన్నారు. అదే చట్టమే గత ప్రభుత్వం మెడకు చుట్టుకుని ఓటమికి కారణమైందన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం తర్వాత రెండో సంతకంగా భూయాజమాన్యహక్కు చట్టాన్ని రద్దు చేయడంపై ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, అల్లు సురేష్‌కుమార్, ఎన్ వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు బగాది తులసీదాస్, ఐఎఎల్ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు కెఎస్ఎస్ సురేష్ ఇతర ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు

ఐలు హర్షం

ఎపి. లాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తూ కొత్త ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) హర్షం వ్యక్తం చేస్తున్నది. ప్రజావ్యతిరేక చట్టానికి వ్యతిరేకంగా న్యాయవాదులు చేసిన ఉద్యమించడంతోపాటు, హైకోర్టులో ఈ చట్టానికి వ్యతిరేకంగా ఐలు రిట్ పిటిషన్ కూడ దాఖలు చేసిందన్నారు. ఈ చట్టం రద్దు నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ, జాప్యం లేకుండా అసెంబ్లీలో ఆమోదింపజేయాలని కోరారు.

విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు



ఉచిత దంత శిబిరంలో పాల్గొన్న వైద్యులు, హెచ్‌ఎం

ప్రజాశక్తి -ఆనందపురం : మండల కేంద్రమైన ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం ఉచిత దంత వైద్యపరీక్షలు నిర్వహించారు. సంగినవలస అనిల్ నీరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ ఓరల్ అండ్ మాక్సిల్లో ఫేషియల్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన దంత వైద్య శిబిరాన్ని హెచ్‌ఎం బి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి దంత సమస్యలు ఉన్న వెంటనే సంబంధిత వైద్యుల దగ్గరికి వెళ్లి పరీక్షలు చేయించుకోని చికిత్స పొందాలన్నారు. ఉచితంగా దంత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసిన ఆసుపత్రి యాజమాన్యాన్ని హెచ్‌ఎం అభినందించారు. డెంటల్ వైద్యులు డాక్టర్ డి.విష్ణువర్ధన్, డాక్టర్ సిహెచ్ నాగరాజు, డాక్టర్ దధిరావు, కృష్ణవంశీ, డాక్టర్ శ్రీయ, డాక్టర్ శ్వేతాశ్రీ పాఠశాలలోని సుమారు 100 మంది విద్యార్థులకు, సిబ్బందికి దంత పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

'విశాఖ' విద్యార్థికి ఉద్యోగావకాశం



పీరా ఉపేంద్ర

ప్రజాశక్తి- పెందుర్తి : నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విభాగానికి చెందిన విద్యార్థి పీరా ఉపేంద్ర బెంగళూరులోని ఇద్వేదా కంపెనీలో ఉద్యోగానికి ఎంపికయ్యాడని కళాశాల చైర్మన్ సత్యనారాయణ, ప్రిన్సిపల్ ప్రదీప్‌వర్మ, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఆడారి తులసినాయుడు తెలిపారు. బెంగళూరులోని ఎద్వేదా కంపెనీలో రూ.7.50లో వార్షిక వేతనంతో ఉపేంద్రకు ఉద్యోగం రావడంపై వారు అభినందించారు. ఈ సందర్భంగా కాలేజీ చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ, తమ కాలేజీకి చెందిన అనేకమంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో మంచి వేతనాలతో ఉద్యోగం దక్కించుకోవడం అభినందనీయ మన్నారు. ఇంటర్వ్యూలలో ఎంపికైన విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని మిగతావారు కూడా ఉద్యోగ అవకాశాలు పొందాలని ఆకాంక్షించారు.

ప్రజల మనిషి రామునాయుడు!

- సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి- ములగాడ : అనుకున్న పని అయ్యేవరకు వదలిపెట్టకుండా పట్టుదలతో పనిచేసే మనిషి ధర్మిరెడ్డి రామునాయుడు అని, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజలు, కార్మికుల సమస్యలపై నిరంతరం పనిచేసిన ప్రజల మనిషి రామునాయుడు అని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు అన్నారు. గురువారం రామునాయుడు మూడవ వర్ధంతిని 62వవార్డు పరిధి త్రినాధపురంలో సిపిఎం మల్కాపురం జోన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ధర్మిరెడ్డి రామునాయుడు చిత్రపటానికి జగ్గునాయుడు పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈసందర్భంగా జోన్ నాయకులు పిసిని రామారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జగ్గునాయుడు మాట్లాడుతూ, దుర్గానగర్ గ్రామకమిటీ ప్రెసిడెంట్‌గా ధర్మిరెడ్డి రామునాయుడు పదేళ్ళగా పనిచేశాడని, ఐఒసిలో సిఐటియు సంఘం ఏర్పాటు చేసి కార్మికుల సమస్యలపై పనిచేశాడన్నారు. దుర్గానగర్ భవన నిర్మాణ సంఘం ఏర్పాటు చేసి కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇప్పించి, సంక్షేమ బోర్డు ద్వారా వచ్చే పథకాలు వచ్చేలా కృషి చేశారన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, ఇంటి పన్నులు,, పట్టాలు, మంచినీరు, రోడ్డు, విద్యుత్, అర్హులైన వారికి ఇళ్లస్థలాలు కోసం భూపోరాటం చేసి అరెస్టయి జైలు పాలయ్యారన్నారు. రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ బిజెపితో కూడిన కూటమి అధికారంలోకి



సమావేశంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

వచ్చిన నేపథ్యంలో రైల్వేజోన్, పోలవరం ప్రాజెక్టు, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా రాష్ట్రంలోని కొత్త ప్రభుత్వం పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు మాట్లాడుతూ, తాను, ధర్మిరెడ్డి రామునాయుడు ఒకే కంపెనీలో పనిచేస్తూ, దుర్గానగర్‌లో సిపిఎం స్థాపనకు కృషి చేశామన్నారు. సభలో సిఐటియు అధక్ష, కార్యదర్శులు కె.పెంటారావు, ఆర్.లక్ష్మణమూర్తి, ఐద్వా జోన్ కార్యదర్శి, రాష్ట్రకమిటీ సభ్యురాలు ఆర్.విమల, డివైఎఫ్ఐ జోన్ కార్యదర్శి ఎస్.వాసు, దుర్గానగర్ అధ్యక్షులు మల్లేష్, క్రాంతినగర్ అధ్యక్షులు పరదేశినాయుడు, భవన నిర్మాణ సంఘం నాయకులు బి.జగ్గునాయుడు పాల్గొని మాట్లాడారు ప్రజానాట్యమండలి కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి దుర్గానగర్ శాఖ కార్యదర్శి బి.అర్జునరావు వందన సమర్పణ చేశారు.

వెంకటరావుది విలువలతో కూడిన జీవితం

- ఉద్యోగ విరమణ సభలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

ప్రజాశక్తి - గాజువాక : స్టీల్‌ప్లాంట్ ఉద్యోగిగా దొడ్డి వెంకటరావు విలువలతో కూడిన జీవితాన్ని గడిపారని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. నడుపూరు ఉక్కు కళావేదికలో ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన వెంకటరావును ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉద్యోగ యూనియన్‌లో కార్మికుల కోసం, సిపిఎంలో ప్రజల కోసం వెంకటరావు పనిచేశారన్నారు. ఉద్యోగ విరమణ తర్వాత, ప్రతిఒక్కరూ ఏదోఒక వ్యాపకం పెట్టుకుని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు.



వెంకటరావు దంపతులను సత్కరిస్తున్న నర్సింగరావు

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. సౌత్ కొరియాకు చెందిన పోస్కో కంపెనీకి కట్టబెట్టాలన్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కుట్రలను, ప్రయివేటీకరణ యత్నాలను ఐక్యపోరాటాలతో ఇన్నాళ్లూ అడ్డుకుని కాపాడుకుంటూ వచ్చామన్నారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల తర్వాత చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలతో ముందున్నంత దూకుడుగా స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై మోడీ ప్రభుత్వం ముందుకెళ్లే పరిస్థితి లేదని, అయినప్పటికీ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. దేశసంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలన్న బిజెపి కుట్రలను అడ్డుకుని ప్రశ్నించిన అందరిపైనా వేధింపులకు దిగిందని, ఆ కోవలోనే ఇద్దరు ముఖ్యమంత్రులు జైలు పాలయ్యారన్నారు. అయోధ్యలో ఓటమితో బిజెపి పాచిక పారలేదని స్పష్టమైందని, ఈ నేపథ్యంలో కేంద్రంపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయం వెనక్కు తీసుకునేలా చేయాలిన్సన బాధ్యత కొత్త ప్రభుత్వంపై ఉందన్నారు. పాల అప్పలరెడ్డి అధ్యక్షతన జరిగిన సత్కార సభలో స్టీల్ ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి, కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు జి శ్రీనివాసరావు, నమ్మి రమణ, సిఐటియు నాయకులు ఎం.రామారావు, బైరెడ్డి గురప్ప, పిట్ట గురునాథరావు పాల్గొన్నారు.

ఉపాధి హామీకి బడ్జెట్‌లో నిధులు పెంచాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి-పరవాడ

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్లో నిధులు పెంచాలని, పని ప్రదేశాల్లో కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సిఐటియూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. పరవాడ మండలంలో ఉపాధి హామీ పథకం కింద చేస్తున్న పనులను పని ప్రదేశాలకు ఆయన వెళ్లి పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి నూతనంగా ఏర్పడిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ పెంచాలని, సంవత్సరానికి 200 పని దినాలు కల్పించాలని, రోజు కూలి రూ.600 ఇవ్వాలని, కూలీలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏ రోజు ఎంత కూలి పడుతుందో తెలియజేసే పే స్లిప్పులు ఇచ్చేవారని, ఇప్పుడు ఇవ్వక పోవడంతో ఏ రోజు ఎంత కూలి వస్తుందో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తట్ట, పారా, గుణపం, మెట్లకు అదనంగా డబ్బులు ఇచ్చేవారని, నేడు అమలు కావడం లేదని, వేసవి అలవెన్స్ కూడా తీసేసారని పేర్కొన్నారు. కూలీలకు నీడకు టెంట్లు, మంచినీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించి, కూలీలు కనీస వేతనం అమలు చేయాలని కోరారు. పని ప్రాంతంలో ప్రమాదాలు జరిగితే పట్టించుకునే నాధుడే లేడని, ఉపాధి కూలీలకు రూ.5 లక్షలు ఇన్సూరెన్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. మూడువారాల బకాయి కూలి డబ్బులు చెల్లించాలని, మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.


ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న సిఐటియు నేత కోటేశ్వరరావు

అచ్యుతాపురం : ఉపాధి హామీ కూలీలకు రోజు వేతనం రూ.600 చెల్లించాలని, ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము డిమాండ్ చేశారు. మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో గురువారం ఆయన ఉపాధి హామీ పనులను పరిశీలించారు. అనంతరం కూలీలను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీ కౌలు రైతు సంఘం ప్రతినిధి సరగడం రామునాయుడు, శ్రీనివాసరావు, ఆలేటి చిరంజీవి, కాశీ రావు, అప్పారావు, రామలక్ష్మి ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఎఐటియుసి డిమాండ్

అనకాపల్లి : ఉపాధి హామీ కార్మికులకు 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజుకి 600 రూపాయలు వేతనం చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో పూడేరు గ్రామంలో గురువారం ఉపాధి పనులు పరిశీలించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసే కుట్రలో భాగంగా బడ్జెట్లో కోతల విధిస్తుందన్నారు. ఉపాధి హామీ చట్టం పటిష్టంగా అమలు చేయడానికి కావలసిన నిధులను కేంద్ర ప్రభుత్వం పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు నారాలశెట్టి సత్యనారాయణ, ఉపాధి కార్మికులు సాయి కుమారి, వెంకటాలక్ష్మి, భవాని, గౌరీ, గౌరీదేవి, శివ లక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ నేతృత్వంలో రాష్ట్రం పురోభివృద్ధి

అనితకు మంత్రి పదవి పట్ల కొణతాల హర్షం

ప్రజాశక్తి-అనకాపల్లి

తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం పురోభివృద్ధి సాధిస్తుందని అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రబాబు పాలన దక్షత, పవన్ కళ్యాణ్ ఆకాంక్షలు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడతాయన్నారు. తాడేపల్లిగూడెం సభలో పవన్ కళ్యాణ్ వైసిపి ప్రభుత్వంపై చేసిన శపథంతో కర్త, కర్మ, క్రియగా ఆయన మారారన్నారు. ప్రజాస్వామ్య పునరుద్ధరణ, అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి, మెగా డీఎస్సీ, పింఛన్ల పెంపు, పోలవరం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు వంటి పనులు జరుగుతాయని చెప్పారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా సెయిల్లోగాని, ఎన్ఎండిసిలో గానీ విలీనం చేసి ఉక్కుకు బొగ్గు కొరత లేకుండా క్యాపిటల్ మైన్స్‌తో నిర్వహిస్తారని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా రాష్ట్రంలోని పల్లెలు అభివృద్ధితో కళకళలాడుతాయన్నారు. కక్ష సాధింపులు లేని ఆదర్శ పాలన అందిస్తామన్నారు. అనకాపల్లి జిల్లా నుంచి రాష్ట్ర మంత్రి పదవి వంగలపూడి అనితకు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అనిత ధైర్యంతో సేవలు అందించారని గుర్తు చేశారు.

ఘనంగా పెందుర్తి ఎమ్మెల్యే

పంచకర్ల రమేష్‌బాబు జన్మదిన వేడుకలు


పంచకర్లకు కేక్ తినిపిస్తున్న టిడిపి, జనసేన నాయకులు

ప్రజాశక్తి- సబ్బవరం

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు జన్మదిన వేడుకలు గురువారం వేపగుంటలోని మీనాక్షి కన్వెన్షన్‌లో ఘనంగా జరిగాయి. నియోజకవర్గ ఎన్‌డిఎ కూటమి నేతలు, జనసేన కార్యకర్తలు ఎమ్మెల్యే పంచకర్లకు దుస్సాలువా కప్పి పూల గుచ్చాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పంచకర్ల ప్రజాసేవలో ఆయురారోగ్యాలతో చిరకాలం వర్ధిల్లాలని పలువురు నేతలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా సీనియర్ నాయకులు బలిరెడ్డి అప్పారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందల వెంకటరమణ, నాయకులు సాలాపు వెంకటేశ్వరరావు, అనకాపల్లి జిల్లా తెలుగు యువత అధ్యక్షులు పిబివిఎస్ఎన్.రాజు, పైడివాడ అగ్రహారం టిడిపి నేతలు అక్కిరెడ్డి దుర్గి నాయుడు, బొబ్బరి కన్నారావు, ఎంపిటిసి సీరం అప్పలరాజు, గొంతిన పైడిరాజు, మండలంలోని పలు గ్రామాలకు చెందిన నేతలు, అభిమానులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సాయినగర్ కాలనీలో..

సబ్బవరం సాయి నగర్ కాలనీలో జిల్లా జనసేన సీనియర్ నాయకులు బలిరెడ్డి అప్పారావు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పంచకర్ల రమేష్‌బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బలిరెడ్డి అప్పారావు, మండల నాయకులు కేకును కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. మహిళలతో కోలాటం నిర్వహించారు. బాణసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శరగడం రాము, జనసేన పార్టీ మండల కన్వీనర్ కర్రి కనకరాజు, బలిరెడ్డి రామకృష్ణ, గండి దుర్గాప్రసాద్, గొల్లపల్లి ప్రభాకర్‌రావు, బంటికోళ్ల పద్మ, సబ్బవరపు శ్రావణి, బర్ల రమణ, పూర్ణచంద్రరావు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.


పంచకర్లకు మండల నేతలు శుభాకాంక్షలు

పరవాడ : పెందుర్తి శాసన సభ్యులు పంచకర్ల రమేష్ బాబుకు మండల టిడిపి అధ్యక్షులు వియ్యపు చిన్న, సారిపల్లి జోగి నాయుడు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ.బోనంగి సర్పంచ్ ఆధ్వర్యంలో..

ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు జన్మదిన సందర్భంగా పరవాడ మండలం ఈ భోనంగి సర్పంచ్ బొడ్డపు శ్రీనివాసరావు, చందక మురళీకృష్ణ, అట్ట సన్యాస అప్పారావు, బుగిడి రామ గోవిందరావు, బొడ్డపు వెంకటరమణ ఆధ్వర్యాన ఆ గ్రామస్తులు, జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు. అనంతరం పరవాడ గవర్నమెంట్ హాస్పిటల్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈదులపాక బోనంగి జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


పంచకర్లకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఈ.బోనంగి నాయకులు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సర్వేజన ఐక్యవేదిక ప్రతినిధులు

రక్తదాన దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -అనకాపల్లి

ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా ఈ నెల14న సర్వేజనా ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక విజయ రెసిడెన్సీలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు ఐక్యవేదిక వ్యవస్థాపకులు కోరిబిల్లి పరమేశ్వరరావు (పరి) పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం రక్తదాన దినోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన చుట్టుపక్కల ఉన్న ఎంతోమంది గర్భిణులకు, తలసేమియా వ్యాధిగ్రస్తులకు, హార్ట్ సర్జరీ ఆపరేషన్లకు, యాక్సిడెంట్ కేసులకు నిత్యం ఎంతో రక్తం అవసరమవుతుందని పేర్కొన్నారు. రక్తదానం చేసే దాతలు మాత్రం పదుల సంఖ్యలో మాత్రమే ఉంటున్నారని, రక్త దానంపై సరైన అవగాహన లేకపోవడం, రక్త దాతలకు ఇవ్వవలసిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం దీనికి కారణమని తెలిపారు. కేవలం స్వచ్ఛంద సంస్థలు మాత్రమే రక్తం సేకరణకు ప్రాధాన్యత ఇస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వం గానీ రాజకీయ నాయకులు గానీ రక్తదాతలను గుర్తించడం లేదన్నారు. ప్రభుత్వం రక్తదాతలకు ప్రత్యేకమైన గుర్తింపు ఇస్తే మరింత మంది రక్త దానం చేయడానికి ముందుకొస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంకుల మధు, దాసరి బాబు, పి.ప్రసాద్, పి.వెంకట్, కొయిలాడ నాగు, కె.తులసి కుమార్, బి.వీరునాయుడు పాల్గొన్నారు.

టిటిసి అభ్యర్థులు పరీక్ష రుసుము చెల్లించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

ఈ ఏడాది ఆగస్టులో నిర్వహించనున్న టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ పరీక్షలకు టిటిసి పూర్తి చేస్తున్న అర్హులైన అభ్యర్థులు పరీక్ష ఫీజు చెల్లించాలని జిల్లా విద్యాధికారి ఎం వెంకటలక్ష్మమ్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే పరీక్ష కేంద్రాలను www.bse.ap.gov.in వెబ్సైట్ ద్వారా తెలుసుకోవాలని కోరారు.

పాల సొసైటీ డైరెక్టర్లు ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని పైడివాడ అగ్రహారం విశాఖ డెయిరీ పాల సొసైటీ పాలకవర్గానికి సంబంధించి ఇద్దరు డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాల సొసైటీ అధ్యక్షుడు సియాద్రి లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన గురువారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ ఇద్దరు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు లక్ష్మణరావు మాట్లాడుతూ పాల సొసైటీలో 140 రోజులు, 1080 లీటర్లు పాలు పోసిన సభ్యులు 93 మంది ఉండగా వారిలో సరిపల్లి శివలక్ష్మి, సరిపల్లి సూరిబాబులను సొసైటీ పాలక వర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని చెప్పారు. నూతనంగా ఎన్నికైన సొసైటీ పాలక వర్గ సభ్యులు మాట్లాడుతూ పాల సొసైటీ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాల సొసైటీ కార్యదర్శి గొర్లి నాగేష్, ఎంపిటిసి సభ్యులు సీరం అప్పలరాజు, మాజీ ఎంపిటిసి సభ్యులు అక్కిరెడ్డి దుర్గి నాయుడు రామలక్ష్మి, మాజీ సర్పంచ్ బొబ్బరి కన్నారావు, మాజీ పాల సొసైటీ అధ్యక్షులు కోన సత్యనారాయణ, గొంతిన పైడిరాజు, గండ్రెడ్డి పెద అప్పారావు, చిన్నారావు, సరిపిల్లి విష్ణు, రాపర్తి ముత్యాలయుడు, అక్కిరెడ్డి అచ్చిబాబు, చిన్నయుడు, సోమేశ్వరరావు, సూకరాజు, అప్పారావు, బొబ్బరి శీను, అప్పారావు, రాము, పెచ్చెట్టి సూరిబాబు, పాలకవర్గ సభ్యులు, అధిక సంఖ్యలో పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.


ఎన్నికైన డైరెక్టర్లతో సొసైటీ పాలకవర్గ సభ్యులు

ఆతిథ్యానికి ఆమడ దూరంలో అతిథి గృహాలు

మూలపడి విశ్రాంతి తీసుకుంటున్న జెడ్పీ, ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లు

ప్రజాశక్తి - యలమంచిలి

మంత్రులు, జిల్లా పరిషత్ చైర్మన్ లాంటి పెద్దలు ఎవరొచ్చినా వారు విశ్రాంతి తీసుకోవడానికి, సమీక్షలు జరపడానికి అతిథి గృహాలు ఎంతో ఉపయోగపడేవి. జిల్లా కలెక్టరు, ఎస్పీ వంటి అధికారులు ఈ విశ్రాంతి గదుల్లోనే ఉండి కార్యకలాపాలు చక్కబెట్టే వారు. అధికార్లతో కలిసి చర్చలు జరిపేవారు. అటువంటి అతిథి గృహాలు నేడు పూర్తిగా మూలనపడ్డాయి. వాటి ఆలనా పాలనా చూసే ప్రభుత్వ పెద్దలు కరువయ్యారు. నిర్వహణ ఖర్చులు మాట అటుంచి అక్కడ ఇప్పటికీ సేవలందిస్తున్న వారికి కనీస వేతనాలు సైతం చెల్లించడం లేదు. అధికారులు, ప్రజా ప్రతినిధులు కూడా గెస్ట్ హౌస్‌ల జోలికి వెళ్లకుండా ప్రభుత్వ కార్యాలయాలు, పార్టీ ఆఫీసుల్లోనే గడిపేసి వెళ్లిపోతున్నారు. దీంతో యలమంచిలిలోని అతిథి గృహాలు నిరుపయోగంగా ఉన్నాయి.

యలమంచిలిలో కోర్టును ఆనుకొని విలువైన 70 సెంట్ల వైశాల్యంతో ఉన్న ఆర్ అండ్ బి అతిథి గృహం మంచి ఫర్నిచర్‌తో చాలా సౌకర్యవంతంగా ఉండేది. 30 ఏళ్ల కిందట ముఖ్యమైన వ్యక్తులు ఎవరొచ్చినా ఈ అతిథి గృహం కేంద్రంగానే వ్యవహారాలు నడిచేవి. ఈ అతిథి గృహం మరమ్మతులు లేక 15 ఏళ్ల క్రితం మూతపడింది. దానివైపు ఎవరూ కన్నెత్తి చూడ్డం జరగలేదు. శిథిలావస్థకు చేరింది. ఆ భూమి విలువ మాత్రం కోట్లు విలువ చేస్తుంది.



ఉపయోగంలో లేని జిల్లా పరిషత్ గెస్ట్ హౌస్



శిథిలమైన యలమంచిలి ఆర్ అండ్ బి అతిథి గృహం

పదేళ్ల క్రితం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌కు ఆనుకొని జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో మరో అతిథి గృహం నిర్మించారు. ప్రస్తుతం అది కూడా అతిథుల నివాసానికి యోగ్యంగా లేదు. నీటి సమస్య వేధిస్తుండంతో ఎవరూ అందులోకి కాలు పెట్టడంలేదు. ఇక్కడ వాచ్‌మెన్, శుభ్రం చేసేవారున్నప్పటికీ వారికి కనీస వేతనాలు కూడా చెల్లించడం లేదని తెలిసింది. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఈ అతిథి గృహాలకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

మా శాఖ అధీనంలో లేదు



యలమంచిలి ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ అంటారు గాని.., అది ఎన్‌హెచ్ఎఐ అధీనంలో ఉంది. ఇప్పటికీ దానిని మాకు అప్పగించలేదు. స్థలం విలువైనదే.., అయితే దానిమీద మాకు ఎటువంటి హక్కులూ లేవు. గతంలో మా అధీనంలోని గెస్ట్ హౌస్‌ల మెయింటినెన్స్ ప్రతిపాదనలు అడిగారు. మా అధీనంలోని కొన్నింటికి పంపించాం. అందులో యలమంచిలి అతిథి గృహం లేదు.

- సత్యవేణి, ఏఈఈ, ఆర్ అండ్ బి శాఖ, యలమంచిలి



ఆర్థిక సాయం అందజేస్తున్న చేగువేరా ఫౌండేషన్ సభ్యులు

అనారోగ్య బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

మండలంలోని కెపి.అగ్రహారం గ్రామానికి చెందిన జామి సత్తిబాబు అనార్యోగంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బంది పడుతుండగా, చేగువేరా ఫౌండేషన్ ప్రతినిధులు చొరవ తీసుకొని ఆర్థిక సాయం అందజేశారు. సత్తిబాబు నెల రోజులుగా అనారోగ్యంతో గాజువాకలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం పొందారు. ప్రైవేటు ఆసుపత్రి ఖర్చులు తట్టుకోలేక, డబ్బులు కట్టే ఆర్థిక స్తోమత లేక సత్తిబాబు పరిస్థితి విషమించడంతో విశాఖలోని కెజిహెచ్‌కు తరలించారు. కనీస ఖర్చులకు కూడా డబ్బులు లేక వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న చేగువేరా ఫౌండేషన్ సభ్యులు వారికి సహాయం చేయడానికి ముందుకొచ్చారు. చుట్టు పక్కల గ్రామాల వారు కూడా వారికి తోచిన సహాయం అందించారు. రెండు రోజులుగా దాతలు అందచేసిన రూ.35,500 నగదును సత్తిబాబు భార్యకు గురువారం చేగువేరా ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తూరిబిల్లి శ్రీనివాసరావు, సుంకర శ్రీను, దేవర భూలినాయుడు, గోపిశెట్టి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై హర్షం

ప్రజాశక్తి-అనకాపల్లి

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి పవన్ కళ్యాణ్‌కు అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంజేవియన్ కుమార్, కార్యదర్శి బంధం దుర్గారావు గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టం చీకటి చట్టంగా అభివర్ణించారు. దీనిని వ్యతిరేకిస్తూ ప్రజలకు మద్దతుగా న్యాయవాదులు దీక్షలు చేపట్టినా గత ప్రభుత్వం కనీసం స్పందించలేదని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ తొలిసారిగా స్పందించారని గుర్తు చేశారు. ఎట్టకేలకు కూటమి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మాట ప్రకారం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి సబ్ స్టేషన్ పరిధిలో కొన్ని ప్రాంతాల్లో మెయింటెనెన్స్ వర్కు కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏపిఈపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాజశేఖర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని లక్ష్మీనారాయణ నగర్, ఉడ్ పేట, గవరపాలెం, గాంధీ మార్కెట్, పూల్ బాగ్, శ్రీనూకాంబిక కోల్డ్ స్టోరేజ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత ఉంటుందని, దీనిని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మూడేళ్ల ఎల్ఎల్‌బికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో మూడు సంవత్సరాల ఎల్ఎల్‌బి కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో తమ విశ్వవిద్యాలయంలో మూడేళ్ల లా డిగ్రీ కోర్సు ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించి గురువారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో జరిగే ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థుల ఎంపిక జరుగుతుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు జులై నెల 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.



సబ్బవరం దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయ

గంజాయి కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

లక్ష రూపాయలు చొప్పున జరిమానా

ప్రజాశక్తి-అనకాపల్లి

గంజాయి కేసులో పట్టుబడిన ఇద్దరు నిందితులకు చోడవరం 9వ అదనపు జిల్లా జడ్జి కోర్టు 10 సంవత్సరాల చొప్పున కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి లక్ష రూపాయల జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెలువరించింది. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ మురళీకృష్ణ గురువారం వెల్లడించారు. అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం బయలపూడి గ్రామానికి చెందిన జాజిమొగ్గల అప్పారావు, జాజిమొగ్గల అర్జున 2015 అక్టోబర్ 3న అక్రమంగా గంజాయిని తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారంతో చీడికాడ ఎస్సై తమ సిబ్బందితో బయలపూడి కెజిబివి తారు రోడ్డు వద్ద మాటు వేసి పట్టుకున్నారు. నిందితుల నుండి రూ.64 వేలు విలువైన 32 కిలోల గంజాయిని మధ్యవర్తుల సమక్షంలో స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేశారు. ఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో కేసు విచారణ చేపట్టి నిందితులకు శిక్ష పడేలా సహకరించిన అడిషనల్ పిపియు వెంకటరావు, అప్పటి ఎస్సై కోటేశ్వరరావులను అభినందించారు.

ఘనంగా మరిడిమాంబ, బంగారమ్మ ఉత్సవాలు

ప్రజాశక్తి-కె.కోటపాడు

మండలంలోని చౌడువాడ గ్రామంలో ఐదు సంవత్సరాలకు ఒకసారి జరుగుతున్న మరిడిమాంబ, బంగారమ్మ ఉత్సవాల్లో గురువారం ఘనంగా జరిగాయి. చౌడువాడతో పాటు చుట్టుపక్కల గుల్లేపల్లి, పాచిలవానిపాలెం, మల్లంపాలెం గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. మహిళలు పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, తెలుగుదేశం నాయకులు పైలా ప్రసాదరావు అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెంది ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు ఈ సందర్భంగా బండారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, స్థానిక నాయకులు మొల్లి గోవింద, పెంటకోట గణేష్, వారాధి మాలిబాబు, తనకల అప్పలనాయుడు, టిడిపి మండల అధ్యక్షుడు రొంగలి మహేష్, ఎ.కోడూరు, సింగన్నదొరపాలెం, గొండుపాలెం సర్పంచులు బొడ్డు అక్కునాయుడు, వెలగల పైడినాయుడు, బండారు లక్ష్మణరావు, పూడి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బండారు

ఆర్‌బికెలో వరి విత్తనాలు సిద్ధం

ప్రజాశక్తి బుచ్చయ్యపేట

మండలంలోని దిబ్బిడి ఆర్‌బికెలో ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఆర్‌జిఎల్ వరి విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని అగ్రికల్చరల్ అసిస్టెంట్ లీలా తెలిపారు. ఒక్కో బస్తా ధర రూ.980, విత్తన శుద్ధి చేసేందుకు రూ.70, వెరసి రూ.1050 చెల్లించాలని పేర్కొన్నారు. అవసరమైన రైతులు సంప్రదించాలని కోరారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న వీరాంజనేయ యూత్ సభ్యులు

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట మండలం చింతలపాలెం జాతీయ రహదారిపై శ్రీవీరాంజనేయ యూత్ ఆధ్వర్యాన గురువారం ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. బుదిరెడ్డి శంకరరావు మంగ దంపతులు ఈ మజ్జిగ సమకూర్చారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కొత్త మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న సాయికృష్ణ

ప్రజాశక్తి- మునగపాక : స్థానిక పురిటి గడ్డ కొత్త మహాలక్ష్మి అమ్మవారిని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ గురువారం దర్శించుకున్నారు. గ్రామ రైతు సంఘం ఆహ్వానం మేరకు విచ్చేసిన ఆయన అమ్మవారికి చీర, సారెలు సమర్పించుకుని, మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో తెలుగు యువత ఎలమంచిలి నియోజకవర్గ అధ్యక్షులు పెంటకోట విజయ్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి దాడి ముసలి నాయుడు, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు దాడి శివ, పురిటిగడ్డ రైతు సంఘం అధ్యక్షులు బుద్ద వెంకట్, దాడి అప్పలనాయుడు, విల్లూరు సాయిరాం, కాండ్రేగుల పరదేశిరావు, బీల లక్ష్మణరావు తదితరులున్నారు.



అమ్మవారిని దర్శించుకున్న సాయికృష్ణ తదితరులు

నక్కపల్లిలో కాంప్లెక్స్ ఉన్నా లేనట్టే..!

-లోపలకురాని బస్సులు
-నిరుపయోగంగా నక్కపల్లి ఆర్‌టిసి కాంప్లెక్స్
-ప్రైవేట్ వాహనాలకు నిలయం
- బస్సుల కోసం ప్రయాణికులు రోడ్డుపై పడిగాపులు

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి ఆర్‌టిసి కాంప్లెక్స్ ఉన్నా.. లేనట్లుగానే ఉంది. కాంప్లెక్స్‌లోకి బస్సులు రానందున నిరుపయోగంగా కాంప్లెక్స్ దర్శనమిస్తుంది. కాంప్లెక్స్ ఆవరణలోకి బస్సులు రానందున ప్రైవేట్ వాహనాలు నిలుపుదలకు నిలయంగా మారింది. గత 15 ఏళ్ల క్రిందట నక్కపల్లిలో ఆర్‌టిసి కాంప్లెక్స్ నిర్మించారు. మొదట్లో కాంప్లెక్స్‌లోకి బస్సులు వచ్చేవి. తర్వాత బస్సులు కాంప్లెక్స్‌లోకి రాకుండానే హైవే నుంచే వెళ్లి పోవడం కొనసాగించేవి. ఇప్పటికీ అదే పరిస్థితి కొనసాగుతుంది.

విశాఖ వైపు నుంచి వచ్చే ఎక్స్‌ప్రెస్‌లు, పాసింజర్ బస్సులు కాంప్లెక్స్‌లోకి రాకపోకలు సాగించేందుకు అనుకూలంగానే ఉంటుంది. తుని నుంచి విశాఖ వైపు వెళ్లే బస్సులు నక్కపల్లి హైవే కాంప్లెక్స్ జంక్షన్ వద్ద టర్నింగ్ పాయింట్ లేక పోవడంతో కాంప్లెక్స్‌లోకి బస్సులు వచ్చేందుకు అంత అనుకూలంగా లేదు. దీంతో, ఇటు విశాఖ వైపు నుంచి వచ్చే బస్సులు గాని, తుని వైపు నుంచి వచ్చే బస్సులు గాని కాంప్లెక్స్‌లోకి రాలేదు. కనీసం అనకాపల్లి నుంచి పాయకరావుపేట వెళ్లే పాసింజర్ బస్సులు కూడా కాంప్లెక్స్‌లోకి రాక పోవడంతో ప్రయాణికులు రోడ్లపైనే బస్సుల కోసం పడిగాపులు కాయలసిన పరిస్థితి నెలకొంది.

చుట్టుపక్కల గ్రామాలకు నక్కపల్లి ప్రధాన కేంద్రం. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఊర్లు వెళ్లాలంటే నక్కపల్లి రావలసిందే. కాంప్లెక్స్‌లోకి బస్సులు రానందున, రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాల వద్ద, రోడ్ల పైన ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తుంది. ఎండకు, వానకు ప్రయాణికులు ఇబ్బందులు వర్ణానతీతం. విద్యార్థుల సైతం బస్సుల కోసం రోడ్లపై నిరీక్షించాల్సిందే. కాంప్లెక్స్‌లోకి బస్సులు రానందున రోడ్డు దాటే సమయంలో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి , బస్సులు రాకుండా నిరుపయోగంగా వదిలేయడంతో ప్రయాణికులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు .ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాంప్లెక్స్‌లోకి బస్సులు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.



కాంప్లెక్స్‌లో నిలిచిన ప్రైవేట్ వాహనాలు

అగమ్య గోచరంగా వైసిపి నేతల పరిస్థితి

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలలో వైసీపీ నాయకుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. గత ఐదేళు పాటు అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతి నిధులు గా ఒక వెలుగు వెలుగున వీరందరూ ఇప్పుడు ఆకాశంలో శూన్యం వైపు చూస్తున్నారు.

మండలం లో సుమారు 28 పంచాయతీ లకు గాను 22 పంచాయతీలలో సర్పంచ్‌లు, 18 ఎంపిటిసి లకు గాను 10 ఎంపిటిసి స్థానాలలో గెలిచినప్పటికి ఇప్పుడు రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో వీరి పరిస్థితి అగమ్య గోచరంగా మారింది.మైజారిటీ సర్పంచ్‌లతో పాటు ఎంపిటిసిలు ఉండటంతో వైసీపీకి చెందిన ఎంపిపిగా పైల రాజు, డిసిఎంఎస్ డైరెక్టర్‌గా గుమ్ముడు సత్య దేవ్ నామినేటెడ్ పదవిలో ఉండగా సచివాలయ వ్యవస్థ మండల కన్వీనర్‌గా కంచిపాటి జగ్గారావు, మండల వైసీపీ అధ్యక్షులు ముక్కా మహా లక్ష్మినాయుడు కొనసాగుతున్నారు.

కొత్తకోట, మేడివాడ, చినపాచిల, పిఎసిఎస్ సంఘాలకు చైర్ పర్సన్‌గా నామినేటెడ్ పదవులలో మరో ముగ్గురు కొనసాగుతున్నారు. ఇప్పటికే మండలం లో కొత్తకోటలో ప్రసిద్ధి చెందిన శివ, కేశవ ఆలయాల చైర్మన్ పదవులకు గుమ్ముడు దొరబాబు, పెనుగొండ మల్లేశ్వరరావు తమ పదవులకు రాజీనామా చేశారు. మండలంలో పలు నామినేటెడ్ పదవులకు రాజీనామా లు చేయగా మరికొందరు రాజీనామాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు..



శిథిలావస్థలో ఉన్న రోడ్డు

లే-అవుట్ యజమాన్యానికి నోటీసులు జారీ

ప్రజాశక్తి - చీడికాడ: ఎటువంటి అనుమతులు తీసుకోకుండా లేఅవుట్లు వేసిన చందనవనం 2 యాజమాన్యానికి నోటీసులు జారీ చేసినట్లు చీడికాడ తహసిల్దార్ ప్రకాష్‌రావు తెలిపారు. మండలంలోని చీడికాడ సర్వే నెంబర్ 119, 120లలో సుమారు 22 ఎకరాల భూమిని విశాఖకు చెందిన ఓ రాజకీయనేత కొనుగోలు చేసి ఎటువంటి అనుమతులు లేకుండా చదును చేసి గ్రావెల్ ను అక్రమంగా తరలించి రహదారుల నిర్మించడమే కాకుండా లేఅవుట్లు వేశారు. ఈ విషయమై తహశీల్దార్ విలేకరులతో మాట్లాడుతూ రోవర్ సర్వే నిర్వహిస్తామని, ఆక్రమణలు జరిగి ఉంటే క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా లేఅవుట్లు వేయడం పై నోటీసు జారీ చేయడం జరిగిందన్నారు. అక్రమాలు జరిగి ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించినట్లు ఆయన తెలిపారు. అరగలమెట్ట గ్రావెల్ తరలింపుపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసిల్దార్ విలేకరులకు తెలిపారు.

మంత్రి అనితకు ఘన స్వాగతం పలకాలి

ప్రజాశక్తి -కోటవురట్ల: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలవడంతో పాటు పాయకరావుపేట నియోజకవర్గానికి ప్రప్రథమంగా వస్తున్న నేపథ్యంలో మంత్రి వంగలపూడి అనితకు భారీ స్వాగతం పలకాలని మండల టిడిపి అధ్యక్షులు జానకి శ్రీను కోరారు. గురువారం ఆయన స్వగృహంలో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల చరిత్రలో ఎన్నడు లేని విధంగా మండలానికి 4500 మెజారిటీ ఇచ్చిన కార్యకర్తలకు, ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలోకి శనివారం మంత్రి అడుగుతున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కదలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు వేచలపు జనార్ధన్, రాజుపేట సర్పంచ్ బొడ్డేటి వెంకటరమణ, కొడవటిపూడి ఎంపీటీసీ సూర్యప్రకాష్, పీకే పల్లి ఎంపీటీసీ శ్రీను, సుంకర బాబ్జి పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన నేతలు

కల్వర్టు శిథిలం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో పందూరు, రామచంద్రపురం సెంటర్ వద్ద ప్రధాన రహదారిలో ఉన్న కల్వర్టు శిథిలమైంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నర్సీపట్నం- పోలవరం రోడ్డులో బ్రిటిష్ కాలంలో నిర్మించిన వంతెన దాదాపు శిథిలమై కుంగి పోవడంతో భారీ వాహనాలు, విద్యా సంస్థలకు వెళ్లే బస్సులు, ద్విచక్ర వాహనదారులు అంతా తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ కల్వర్టు కుంగి పోవడంతో ముంద స్తుగానే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.



ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ జారీ చేయాలి

-సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస

ప్రజాశక్తి -పాడేరు: ఆదివాసి స్పెషల్ డిఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో నూరు శాతం రిజర్వేషన్ అమలకు ఆర్డినెన్స్ చేయాలని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జీవో 3 పునరుద్ధరణకు చట్టబద్ధత కల్పించాలని సీఎం చంద్రబాబు నాయుడు ను అల్లూరి జిల్లా సిపిఎం కార్యదర్శి పి.అప్పల నరస కోరారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, సీఎంగా బాధ్యతల స్వీకరణ అనంతరం మెగా డిఎస్సీ ప్రకటనపై తొలి సంతకం చేయడంతో యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. జాతీయ విద్య హక్కు చట్టం ప్రకారం రాష్ట్రం లో సుమారు 50 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. బి.జె.పి ప్రభుత్వం పార్లమెంటులో ఈ ఖాళీలను ప్రకటించిందన్నారు. ప్రస్తుతం 16349 ఖాళీల భర్తీకి చంద్ర బాబునాయుడు సంతకం చేశారని, మిగిలిన ఖాళీల భర్తీకి కూడా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు జీఓ 3 రిజర్వేషన్ కు చట్ట బద్ధత కల్పించాలన్నారు. గత జగన్ ప్రభుత్వం నిరుద్యోగులకు మోసం చేసిందని, ఆదివాసీలకు నూరు శాతం రిజర్వేషన్ పునరుద్ధరణకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని, అందుకే నేడు ఆదివాసీ యువతకు ఉద్యోగావకాశాలు దూరంగా ఉన్నాయన్నారు.

అరకు లోయ: ఆదివాసీ స్పెషల్ డిఎస్సీ నోటిఫికేషన్ పై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన చేయాలని ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి సీతారామరాజు జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది.ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్, జిల్లా అధ్యక్షులు ధర్మన్న పడాల్, జిల్లా నాయకులు చినబాబు, సురేష్ కుమార్, కొండలరావులు స్థానిక గిరిజన భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, మిగిలిన టీచర్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు పనులు చేపట్టాలని..

గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి -అనంతగిరి: రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతూ గురువారం పసిని గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు జోగులు, కె.రామయ్యలు మాట్లాడుతూ, రోంపలి పంచాయతీ మర్రివలస నుండి పసినీ గ్రామాలకు 2020-21 సంవత్సరంలో రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.60 లక్షల నిధులు మంజూరు కాగా మెటల్ వేసి రోలింగ్ తో పాటు అవసరమైన చోట కల్వర్టు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. అసంపూర్తిగా పనులు చేపట్టి సుమారు 38 లక్షల 99 వేల 143లక్షల నిధులు సంబదిత అదికారులు, కాంట్రాక్టులు కుమ్మక్కై నిధులు స్వాహాకు పాల్పడ్డారని ఆరోపించారు. కల్వర్టు కట్టి అసంపూర్తిగా వదిలేసారన్నారు. వర్షాకాలంలో రాకపోకలు నిలిచి పోతునాయన్నారు. తక్షణమే రోడ్డు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సన్యాసి, కోటపర్తి, రామయ్య, డోల జోగులు తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

నీటిని పొదుపుగా వాడాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడాలని ఉద్దండపురం హైస్కూలు హెచ్‌ఎం డి.సత్యారావు సూచించారు. మండలంలో మిషన్ లైఫ్ వారోత్సవాల్లో భాగంగా ఉద్దండపురం హైస్కూల్లో ఎకో క్లబ్ ఆధ్వర్యంలో హెచ్‌ఎం సత్యారావు గురువారం సేవ్ వాటర్, ఎనర్జీ యాక్టివిటీస్ పై విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. నీరు వృథా చేయకుండా చేపట్టవలసిన పద్ధతులపై అవగాహన కల్పించారు. భూగర్భ జలాలను సంరక్షించుకోవాలన్నారు.నీటిని వృథా చేయకుండా నీటిబొట్టు ఒడిసి పట్టాలన్నారు.ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ వేలంశెట్టి శ్రీను, సభ్యులు పాలూరి శ్రీనువాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బండారు సత్యనారాయణమూర్తి

మోదకొండమ్మ జాతరను జయప్రదం చేయాలి

-ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి-మాడుగుల: ఈనెల 18న చేపట్టే మాడుగుల మోదకొండమ్మ జాతరను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కోరారు. గురువారం మాడుగుల మోదకొండమ్మ ఆలయ సమీపంలో తులసి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఉన్నతాధికారుల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ,మోదకొండమ్మ జాతరకు రాష్ట్ర నలుమూలల నుండి సుమారు లక్ష మంది వచ్చే అవకాశం ఉందన్నారు.అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని సూచించారు.విద్యుత్, ఆర్టీసీ, నీటిపారుదల, పారిశుధ్యం, డ్రైనేజీ, మరుగుదొడ్ల ఏర్పాటు, భక్తులకు చలివేంద్రాలు, వైద్య సదుపాయంపై ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యుడు గవిరెడ్డి రామానాయుడు, తెలుగుదేశం నియోజకవర్గ నాయకుడు పైలా ప్రసాద్‌రావు, మోదకొండమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల అప్పలరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీనాధు శ్రీనివాసరావు (దేవరపల్లి శ్రీను), మండల తెలుగుదేశం అధ్యక్షుడు అద్దిపల్లి జగ్గారావు, క్లస్టర్ ఇంచార్జ్ పుప్పాల రమేష్, టౌన్ ప్రెసిడెంట్ రంజిత్ వర్మ, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, జనసేన మండల అధ్యక్షుడు గట్టి రెడ్డి శివాజీ పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న అనిత

కనకదుర్గమ్మ సన్నిధిలో మంత్రి అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి: విజయవాడ కనకదుర్గమ్మను మంత్రి వంగలపూడి అనిత దర్శించుకున్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో భారీ మెజారిటీతో గెలుపొంది, కూటమి ప్రభుత్వంలో మంత్రివర్గంలో ఆమెకు స్థానం కల్పించడంతో గురువారం అనిత కుటుంబ సభ్యులతో కనకదుర్గమ్మను దర్శించుకున్నారు.



ఆనంద వ్యక్తం చేస్తున్న నాయకులు

జనసేన నేతల సంబరాలు

ప్రజాశక్తి -నక్కపల్లి: కూటమి ప్రభుత్వంలో జనసేన విజయకేతనం ఎగురవేయడంతో నక్కపల్లిలో జనసేన పార్టీ కార్యాలయం వద్ద గురువారం ఆ పార్టీ నాయ కులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. కూటమి ప్రభుత్వంలో జనసేనకు కేటాయించిన ఎమ్మెల్యే లు, ఎంపీలు అన్ని స్థానాల్లోనూ అఖండ విజయం సాధిం చడం సంతోషదాయకమన్నారు. కూటమి ప్రభుత్వంలో పవన్ కళ్యాణ్ కీలకంగా వ్యవహరిం చారన్నారు. అనంతరం కేక్ కట్ చేసి, బాణసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి ఆకేటి గోవిందరావు, జాయింట్ సెక్రటరీ కురుందాసు అప్పలరాజు, నాయకులు పాము గణేష్, ఎలమంచిలి చంద్రరావు, మనబల మంగాబాబు, చేపల రాము తదితరులు పాల్గొన్నారు .

ఆగని ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి -చీడికాడ: మండలంలోని కోనాం జలాశయం నుండి ఇసుక అక్రమ ఆగలేదు. ఇటీవల ఇసుక అక్రమ రవాణాపై విలేకరులు తహసిల్దార్ దృష్టికి తీసుకువెళ్లగా నిలుపుదల చేయాలని వీఆర్వోను ఆదేశించారు.వీఆర్వో వరాహమూర్తి ఇసుక అక్రమ తరలింపు జరగకుండా రహదారికి అడ్డంగా మట్టిగట్టు వేయించారు. మట్టి గట్టు వేయించి 15 రోజులు కాక మునుపే బుధవారం రాత్రి రెండు ట్రాక్టర్లతో మట్టి గట్టును చదును చేసి ఇసుకను అర్ధరాత్రి నుండి తెల్లవారుజాము వరకు దర్జాగా తరలించి విక్రయాలు చేసుకున్నారని ఈ ప్రాంతీయులు ఆరోపించారు.తెల్లవారిన అనంతరం ఏమీ ఎరగనట్టు ట్రాక్టర్లను తమ ఇళ్ల వద్ద నిలిపి ఉంచుతున్నారు. అర్ధరాత్రి అయితే చాలు మరల ఇసుకను తరలిస్తున్నారు.

ఈ విషయాన్ని తహసిల్దార్ ప్రకాష్‌రావుకు తెలియజేయగా తమ ఆదేశాలను సైతం బేఖాతరు చేసి ఇసుకను తరలిస్తే సహించేది లేదన్నారు. తక్షణం ఆ ప్రాంతాన్ని పరిశీలించి విచారించి ఇసుక తరలించిన వారిపై కేసులు నమోదు చేయించడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయంలో ఉపేక్షించేది లేదని తహసిల్దార్ తెలిపారు.



రవాణాకు పాల్పడుతున్న ఇసుక ప్రాంతం ఇదే..

విశాఖ పోర్టును సందర్శించిన నేపాల్ బృందం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : నేపాల్ కాన్సులేట్ జనరల్, ఈశ్వర్‌రాజ్ పౌడెల్ నేతృత్వంలో జనక్ భట్ట, డిప్యూటీ కాన్సులేట్ జనరల్, నేపాల్ రాయబార కార్యాలయం, కోల్ కతా, తారనాథ్ అధికారి, ఎకనామిక్ మినిస్టర్ నేపాల్ ఎంబసి, ఢిల్లీలతో కూడిన బృందం విశాఖపట్నం పోర్టులో గురువారం పర్యటించింది. పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు నేపాల్ బృందానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నేపాల్‌తో కంటైనర్ వాణిజ్యానికి సంబంధించిన పలు అంశాలపై వారు చర్చించారు. విశాఖపట్నం పోర్టు నేపాల్ కంటైనర్ కార్గోకు ముఖ్యమైన కేంద్రంగా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో నేపాల్‌కు సంబంధించిన 42,550 కంటైనర్లను విశాఖపట్నం పోర్టు హ్యాండిల్ చేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే ఇది 161శాతం అధికం. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కంటైనర్ కార్గోలో మరింత పెరుగుదలను ఏ విధంగా తీసుకురాలనే అంశంపై ఈ సమావేశంలో వ్యూహాత్మకమైన చర్చ జరిగింది. కస్టమ్స్, ట్రాన్సిట్ సదుపాయాలు వంటి కీలకమైన అంశాలను చర్చించారు. ప్రస్తుతం నేపాల్ ఆధారిత కంటైనర్ సరుకు రవాణాలో ఏవైతే పద్ధతులను పాటిస్తున్నామో అవన్నీ భవిష్యత్తులో నిరంతరం కొనసాగుతాయని అంగముత్తు, స్పష్టం చేశారు. నేపాల్ వాణిజ్య అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ వెల్లడించారు.



నేపాల్ బృందానికి షిప్‌ను బహూకరిస్తున్న విశాఖ పోర్టు చైర్మన్ అంగముత్తు

ఘనంగా మరిడిమాంబ పండగ

ఉత్సాహంగా ఎడ్ల బళ్ల పోటీలు

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ మండలం కొంగసింగి గ్రామంలో గురువారం మరిడిమాంబ అమ్మవారి పండుగను గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం నుండే భక్తులు అమ్మవారిని దర్శించుకొని పసుపు కుంకుమలు సమర్పించి తమ మెక్కులు చెల్లించుకున్నారు. పండుగ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించామని సర్పంచ్ నూకరత్నం, వరహాలబాబు తెలిపారు. మధ్యాహ్నం ఎడ్లబండి పోటీలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.



పరుగు పెడుతున్న ఎడ్లు

అన్నవరంలో చోరీ

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలోని అన్నవరం గ్రామంలో ఈనెల 8న పసుపులేటి మంగ భర్త వెంకటరమణ ఇంట్లో జరిగిన చోరీపై బాధితులు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. స్థానిక ఎస్సై రమణయ్య ఇచ్చిన వివరాలు ప్రకారం మూడు తులాల బంగారం, 10 తులాల వెండి చోరీ జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మన్యంలో మోగిన బడిగంట

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాలలు వేసవి సెలవుల అనంతరం గురువారం తెరుచుకున్నాయి. పాడేరు డివిజన్లో ఉన్న 117 బాలికల, బాలుర గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల తోపాటు 667 ప్రాథమిక పాఠశాలలు గురువారం నుంచి తెరుచుకున్నాయి. 300 నుంచి 450 మంది వరకు విద్యార్థిని విద్యార్థులు ఉంటున్న ఈ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో తొలిరోజు గురువారం 30 నుంచి 50 మంది వరకు మాత్రమే హాజరైనట్లు జిల్లా కేంద్రంలో ఉన్నతాధికారులకు సమాచారం అందింది. దీనిపై గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఐ.కొండలరావు స్పందిస్తూ మరో రెండు రోజుల వ్యవధిలో అన్ని పాఠశాలలకు విద్యార్థుల నూరుశాతం హాజరు పూర్తయ్యే టట్లు చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలలకు విద్యార్థులు చేరగానే తదుపరి విద్యా కార్యక్రమాలను ప్రారంభించాలని సూచించారు.

దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలం లోని పనసపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల(బాలికలు)లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రధానోపా ధ్యాయులు ఎన్.రామారావు గురువారం పత్రిక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. 3వ తరగతిలో 40 సీట్లు, 4వ తరగతిలో 34, ఐదవ తరగతిలో 30, ఆరవ తరగతిలో 20, ఎనిమిదవ తరగతిలో 9 సీట్లు, తొమ్మిదవ తరగతిలో 20, 10వ తరగతిలో 18 సీట్లు ఖాళీ ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల విద్యార్థులు ఖాళీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు హెచ్ఎం రామారావు ఫోన్: 7981294 903ను సంప్రదించాలని కోరారు.బంగారు మెట్ట పంచాయతీ కేంద్రంలోని ఆశ్రమ బాలికల పాఠశాలలో ఖాళీల వివరాలు ఇలా ఉన్నాయి.మూడవ తరగతిలో 40, నాలుగవ తరగతిలో 34, ఐదవ తరగతిలో 23, ఆరవ తరగతిలో 16 చొప్పున సీట్లు ఖాళీలు ఉన్నాయని, 7నుండి పదవ తరగతి వరకు సీట్లు ఖాళీలు లేవని స్పష్టం చేశారు. పాఠశాలలో వివిధ తరగతులలో మొత్తం సీట్లు 113 ఉన్నట్లు వెల్లడించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాస్ ఆధ్వర్యంలో నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్ రవిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబుకి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మున్సిపాలిటీ జనాభా ప్రకారంగా సిబ్బందిని పెంచాలన్నారు. ఈ నియామకాల్లో బలిఘటం, బొడ్డేపల్లి తదితర ప్రాంతాల కార్మికుల పిల్లలకి అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు వేమగిరి రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ సిహెచ్ కుమార్, కార్యదర్శి కె.రవి, క్యాషియర్, పి.అక్కునాయుడు, జిల్లా నాయకులు ఎం.రమణ, నియోజకవర్గ కార్మిక నాయకులు పాలపర్తి తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఒ సుధారాణి

వరి విత్తనాలు సిద్ధం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో ఆరు రైతు భరోసా కేంద్రాల్లో వరి విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారులు సుధారాణి గురువారం తెలిపారు. చోద్యం, కొత్త మల్లంపేట, జోగంపేట, గుండుపాల, ఏఎల్ పురం రైతు భరోసా కేంద్రాల్లో శ్రీకాకుళం సన్నాలు, 1064, సాంబమసూరి, సోనా మసూరి, తెలంగాణ సన్నాలు వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అమె చెప్పారు. వరి విత్తనాలు కావలసిన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ బుక్‌లు ఆయా రైతు భరోసా కేంద్రాలకు తీసుకువెళ్లి ఆన్లైన్ చేయించుకోవాలని ఆమె సూచించారు.